


# టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



# చిట్టి చిలుక చదువు రవీంద్రనాథ టాగోర్

*తోతా కహాని, (బెంగాలీ, 1917)*



అనగనగా ఒకానొకప్పుడు, ఒక చిట్టి చిలుకమ్మ ఉండేది.

అది ఒట్టి చదువురాని మొద్దు, ఒక అజ్ఞాని.

ఆ చిట్టి చిలుకమ్మ పాటలు బాగానే పాడేది. కానీ, ఏ ధర్మశాస్త్రాలూ వల్లించలేదు. చెట్ల కొమ్మల మీద ఊరుకూరికినే, అటూ ఇటూ బాగానే గెంతులు వేసేది. కానీ, దానికో పద్ధతి, సభ్యత అనేది పాటించేది కాదు.

ఇదంతా గమనించిన మహారాజు గారు తనలో తనే అనుకొన్నారు:

"అజ్ఞానం ఖరీదైన వ్యవహారం. అది ఎక్కువకాలం పనికిరాదు. పనికి రానివాడు, తిండికి తిప్పరాజు పనిపోతు రాజులా తయారవుతాడు! చదువు రాని మొద్దు, కదలలేని ఎద్దు!"

మహారాజు తక్షణం తన మేనల్లుళ్ళను ప్రవేశపెట్టించాడు. చిట్టి చిలుకమ్మను మంచి బడిలో చేర్పించి, గట్టిగా చదువు చెప్పించాలని ఆదేశించాడు.

రాజు గారి మేనల్లుళ్ళు ఒక బ్రహ్మాండమైన పండితుల సమావేశానికి ఆజ్ఞాపించారు. ఆ ఘనాపాటీ పండితులంతా మూకుమ్మడిగా ఆ చిలుకమ్మ అజ్ఞానానికి మూలాలను అన్వేషించారు. ఎట్టకేలకు, ఆ చిలుకమ్మ అజ్ఞానానికి గల మూలకారణాన్ని శోధించి పట్టుకొన్నారు.

చిలుకమ్మ తన సహజగుణం చేత పేదరికం ఉట్టిపడే పుడకల గూడులో నివసిస్తోంది. అందుచేత, ఆ చిలుక చదువులో మొదటి పాఠం చిలుక నివాసాన్ని కొమ్మ మీది గూడులోనుంచి సరియైన పంజరంలోకి మార్చడం.

ఈ సమాధానంతో సంతుష్టులయిన మహారాజు గారు ఇచ్చిన బ్రహ్మాండమైన కానుకలను మోసుకొంటూ ఆ పండితవర్యులు పరమానందంతో ఇళ్ళకు తిరిగి వెళ్ళారు.

వెంటనే, ఒక ఉత్తమోత్తమ స్వర్ణకారుడు తన పనిలోపడ్డాడు. ఒక దివ్యమైన బంగారుపంజరాన్ని తయారుచేశాడు. ఆ పంజరం అందమైన నగిషీలతో, నవరత్నఖచితభరితంగా, శోభాయమానంగా, ధగధగలాడుతూ ఉన్నది. ప్రపంచం నలుమూలల నుండీ ఎక్కడెక్కెడి వారో వచ్చి అంత అందమైన పంజరాన్ని చూసి వెళ్ళేవారు.

అయితే, కొందరు బిగ్గరగానే అన్నారు:

"సంస్కృతిని పట్టి బంధించారు, పంజరంలో పెట్టారు!"

ఆవేదనతో వాళ్ళ కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

"సంస్కృతి పోతే పోతుంది. పంజరం మిగులుతుంది. ఎంత తెలివైన ఆలోచన! ఎంత అదృష్టమో ఆ చిలుకమ్మది!" అన్నారు మరికొందరు.

ఆ స్వర్ణకారుడు సంచుల్లో పట్టినన్ని బంగారు నాణాలు కుక్కుకొని, పరమ సంతోషంతో ఇంటికి తిరిగి వెళ్ళాడు.

ఒకానొక గొప్ప గురువు గారు చిలుకమ్మకు చదువు చెప్పడం మొదలుపెట్టాడు. చిటికెడు నశ్యం నసాళాకిని అంటేట్టు పట్టిస్తూ అన్నాడు గురువు గారు:

"మన ఆశయం నెరవేరడానికి, ఎన్ని పాఠ్యగ్రంథాలు ఉన్నా... ఎక్కువేమీ కావు!"

రాజు గారి మేనల్లుళ్ళు ఒక పెద్ద లేఖకుల గుంపును రప్పించారు. ఆ లేఖకులు వివిధ గ్రంథాలలోనుంచి పాఠాలను చూసి రాయడం మొదలెట్టారు. వ్రాతప్రతులు తయారవుతున్నాయి. ఆ ప్రతులనుంచి మలిప్రతులు, వాటి నుంచి మరికొన్ని ప్రతులు. రాసినవి రాసినట్లే, ఒకదాని మీద ఒకటి పేర్చుతూపోయారు.

"అబ్బ! సంస్కృతీగోపురం! ఎంత ఎత్తో! ఆ గోపురశిఖరం కంటికి అందనంత ఎత్తులో మేఘాల్లోకి దూసుకుపోతోంది!" చూసినవారు ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్లబెట్టారు.

ఇక, రాసినవారు... అదే... ఆ లేఖకుల గుంపు, తేలికపడ్డ మనసులతో, బాగా బరువెక్కిన జేబులతో ఇళ్ళకు మళ్ళారు.

రాజు గారి మేనల్లుళ్ళు ఆ పంజరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దడానికి అహర్నిశలు తీవ్రంగా కృషి చేస్తున్నారు. క్షణం తీరిక లేకుండా వారు ఆ బంగారు పంజరాన్ని మిరుమిట్లు గొలిపేలా మెరుగులు పెట్టిస్తూ, నగిషీలు దిద్దుతూ ఉంటే, అందరూ ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకొంటున్నారు.

"అభివృద్ధి అంటే అదండీ!" అంటూ.

చాలామందికి కొత్త ఉద్యోగాలు వచ్చాయి. ఆ ఉద్యోగుల మీద పర్యవేక్షకులు, వాళ్ళ మీద మరింతమంది సమీక్షకులు, అంచెలంచెలుగా ఆధికారులు.

ఆ ఉద్యోగులు, ఆ ఉద్యోగుల మీది ఉద్యోగులు, ఆ ఉద్యోగుల మీది ఉద్యోగుల మీది ఉద్యోగులు, వారి దగ్గర బంధువులు, దూరపు చుట్టాలు——అందరూ ఒక బ్రహ్మాండమైన మందిరాన్ని నిర్మించుకొని హాయిగా జీవించసాగారు.



ఇక ఎన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నప్పటికీ, తప్పులెన్నువారు తండోపతండాలు. ఇలా, ఎంతో మంది ఎన్నో రకాలుగా ఆ తళతళాడే బంగారు పంజరంతో ముడిపడి ఉన్నారు. వారందరికీ ఆ పంజరం కబుర్లతో విడదీయరాని బంధం ఏర్పడిపోయింది——ఒక్క చిట్టి చిలకమ్మకు తప్ప.

ఈ సమాచారం ఎలాగో రాజుగారి చెవిలో పడింది. వెంటనే, రాజుగారి మేనల్లుళ్ళను తన ముందుకు ప్రవేశపెట్టమన్నాడు.

"నేనేం వింటున్నాను?" రాజు గారు గద్దించారు.

"మహారాజా, నిజం తెలియాలంటే మీరు పండితులను, స్వర్ణకారులను, వ్రాతగాళ్లను పిలిపించి అడగండి. తప్పులు ఎన్నే వాళ్ళ తిండికి ఏం తక్కువ? అందుకే వారి నాలుకలు ఇలా పదునెక్కిపోయాయి!" పలుకు పలుకులో విశ్వాసం ఉట్టిపడే వారి సమాధానం రాజుగారికి ఎంతో సంతృప్తిని ఇచ్చింది.

రాజు గారు తన మేనల్లుళ్ళ కార్యదక్షతకు ఎంతో మురిసిపోయాడు. వెంటనే, తన ముచ్చట కొద్దీ తన మెడలోని వజ్ర వైఢూర్య మరకత మణిహారాలను తీసి తలా ఒకటి బహూకరించాడు.

రాజుగారికి తన విద్యామంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరుగుతోన్న ఈ వినూత్న ప్రయోగాన్ని ఒక్కసారి స్వయంగా చూడాలని అనిపించింది. అనుకున్నది ఆలస్యం, చిలుక శిక్షణామందిరానికి స్వయంగా వేంచేశారు.

ఆ శిక్షణామందిర ప్రధాన ద్వారం వద్ద రాజు గారికి ఘనమైన స్వాగతం లభించింది. శంఖాలు, శృంఖనాదాలు, జేగంటలు, నగారాలు, కొమ్ము బూరాలు, బాకాలు, గొట్టం బాకాలు, తోలుతిత్తి బాకాలు, చిడతలు, డోళ్ళు, డప్పులు, ఢంకాలు, తప్పెటలు, కంజీరాలు, వేణువులు, పిల్లంగ్రోవులు మొదలయిన ఎన్నెన్నో సమరాంగణ వాయిద్యాలు ఉవ్వెత్తున బజాయించారు.

పండితులు తమ ఉచ్చస్వరంతో మంత్రాలు చదవడం మొదలుపెట్టారు. స్వర్ణకారులు, లేఖకులు, వాళ్ళ దగ్గర బంధువులు, దూరపు చుట్టాల కరతాళ ధ్వనులతో ఆహ్వానం పలికారు.

రాజు గారి మేనల్లుళ్ళు చిరునవ్వుతో అడిగారు: "మహారాజా, ఇవన్నీ స్వయంగా చూశాక తమరేం అనుకొంటున్నారు?"

మహారాజు గారు అన్నారు: "వినూత్న విద్యాసిద్ధాంతం మహోజ్వలంగా ధ్వనిస్తోంది!"

మహారాజు గారు తన కొండంత ఏనుగు మీద నుంచి దిగబోయారు.

ఇంతలో, పొదచాటు నుంచి ఆస్థాన తప్పులెన్నువాడు కేక వేశాడు:
"మహారాజా! ఇంతకీ, మీరు చిట్టి చిలుకను చూశారా?"

"అరరే! నిజంగానే నేను చిలుకమ్మను పలకరించనేలేదు!"

రాజు గారు ఎక్కబోయిన అంబారీని దిగి, మళ్ళీ వెనక్కి వెళ్లారు.

చిలుక శిక్షణామందిరంలో పండితులు చదువు చెప్పే ఫధ్ధతులు చూసి ఎంతో సంతోషించారు. అసలు చిట్టి చిలుకకు ఏ మాత్రం ప్రమేయం లేకుండానే ఆ పాఠాలన్నీ అద్భుతంగా రచించారు. పై నుంచి ఎంతో చక్కగా ఆ పాఠాలన్నీ చెపుతున్నారు. చదువు చెప్పే ఏర్పాట్లన్నీ ఎంత బ్రహ్మాండంగా ఉన్నాయంటే, చిలుక ప్రస్తావన మాటవరసకు కూడా వచ్చే అవకాశం లేదు.

ఇక, చిలుక ఏవైనా ఫిర్యాదులు చేస్తుందా అంటే, అసలా అవకాశమే లేదు. పీకలదాకా కుక్కిన తాళపత్ర గ్రంథాల ఆకులతో ఆ చిలుకమ్మ గొంతు పూడుకుపోయి ఉంది.

చిలుకమ్మ కనీసం ఈల కూడా వేయడం లేదు. పోనీ, గుసగుసలాడుతుందా అంటే, అదీ లేదు.

ఎవరికైనా సరే, చిలుకమ్మకు చదువు చెప్పిన క్రమశిక్షణా విధానాన్ని గమనిస్తే, ఒక సన్నని గగుర్పాటు కలగక మానదు. రాజు గారు తిరిగి తన ఏనుగు అంబారీ మీదకు ఎక్కబోయే ముందు, ఆ "ఆస్థాన తప్పులెన్నువాడి" రెండు చెవులు పట్టి లాగి వదలమని "ఆస్థాన చెవిలాగుడు ఉద్యోగి"కి పురమాయించాడు.

అలా ఆ చిట్టి చిలుకమ్మ నెమ్మదిగా, సరైన వ్యవధిలో, సురక్షితంగా ఒక అభావంలోకి చేరుకొంటూ, అద్భుతంగా తన చదువు కొనసాగిస్తోంది. చిలుకమ్మ చదువు వృద్ధి మహా సంతృప్తికరంగా సాగుతోన్నది. అయితే, ప్రకృతి అప్పుడప్పుడు మానవసృజిత కఠోరశిక్షణ మీద విజయం సాధిస్తున్నది.

ఉదయపు వెలుతురు పంజరంపై వాలీవాలగానే, చిట్టి చిలుక పంజరంలో ఉన్నచోటే రెక్కలు ఆడించి ఎగరాలని ప్రయత్నిస్తోంది. పంజరం చువ్వలను తన నాజూకు ముక్కుతో కొరకాలని ప్రయత్నిస్తోంది. నమ్మశక్యం కానంత దిగులుగా కనబడుతుంది.

"ఎంత అవిధేయత!" కొత్వాల్ గర్జించాడు.

అంతే, తన కొలిమి, సుత్తిలతో సహా కంసాలికి రాజు గారి విద్యాశాఖలో ఉద్యోగం లభించింది. సుత్తి దెబ్బలు ఖణేల్ ఖణేళ్ మంటూ ఎంతగా ప్రతిధ్వనించాయో!

త్వరలోనే, పంజరం చుట్టూ బలమైన నిగనిగలాడే ఇనుప గొలుసులు తయారయ్యాయి. కంసాలి పదునైన కత్తెర తయారు చేయడం ఆలస్యం, చిట్టి చిలుకమ్మ రెక్కలు మొదలంటా కత్తిరించబడ్డాయి.

రాజు గారి మేనల్లుళ్ళు నల్లముఖాలు వేశారు. తమ తలలు ఆడిస్తూ అన్నారు:

"ఈ పిట్టలున్నాయి చూశారా! వీటికి ఒక విచక్షణా లేదు... ఒక కృతజ్ఞతా లేదు!"

ఒక చేత్తో పుస్తకాన్ని, మరో చేత్తో బెత్తాన్ని పట్టుకొని గురువుగారు పాఠాలు అని పిలవబడే వాటిని చిట్టి చిలుకమ్మకు చెపుతున్నారు——ఎలాంటి ఆటంకం లేకుండా.

గొప్ప కాపలాదారుగా కొత్వాలు, ఇనుప గొలుసుల తయారీ కళాప్రపూర్ణగా కంసాలి, రాజు గారి చేతుల మీదుగా ఘన సత్కారాలు పొందారు.

చిట్టి చిలుకమ్మ చనిపోయింది.

ఇది ఎంత కాలం క్రితం జరిగిందో ఎవరికీ తెలియదు. ఈ గాలికబురును మొట్టమొదట ప్రచారం చేసిన వాడు "ఆస్థాన తప్పులెన్నువాడు".

రాజు గారు తక్షణం మేనల్లుళ్ళను రప్పించాడు.

"నా ప్రియాతిప్రియమైన మేనల్లుళ్ళారా! మేము ఏం వింటున్నాం?"

రాజు గారి మేనల్లుళ్ళు బదులిచ్చారు:

"మహారాజా! చిలకమ్మ చదువు పూర్తయ్యింది!"

"ఆ చిలుక ఎప్పుడైనా గెంతిందా?"

"ఊహు! ఎన్నడూ గెంతలేదు, మహారాజా!" మేనల్లుళ్ళు చెప్పారు.

"చిలుక ఎప్పుడైనా ఎగిరిందా?"

"లేదు!"

"ఆ చిలుకను నా ముందు ప్రవేశపెట్టండి!" రాజు గారు ఆజ్ఞాపించారు.

చిలుకను రాజు గారి ముందుకు తీసుకువచ్చారు——కొత్వాలు, సైనికులు, రాజభటుల బందోబస్తులో.

రాజు గారు తన చూపుడు వేలితో ఆ పిట్ట పొట్ట మీద పొడిచాడు. ఆ చిట్టి చిలుకమ్మ శరీరం నిండా పేరుకుపోయిన కాగితాల దొంతరలు గరగరలాడాయి.

కిటికీకి ఆవలగా, వసంతమాసపు తాజా గాలి అప్పుడే చిగుర్చిన అశోక వృక్షాల మీదుగా రహస్యంగా గుసగుసలాడుతూ, ఆపేక్షతో ఆక్రోశిస్తోంది——ఆ ఏప్రిల్ మాసంలా.

★

## అనుసృజకుల వ్యాఖ్యానం

ఈ **చిట్టిచిలుక చదువు** కథను మొదట, **తోతాకహిని** (1917) పేరిట బెంగాలీలో రచించారు. సమకాలీన విద్యావిధానాన్ని బలంగా విమర్శిస్తూ, టాగోర్ వేసిన చురక ఈ కథ. లిపిక (1922) సంచికలో టాగోర్ స్వయంగా చేసిన అనువాదం అచ్చయ్యింది. వందేళ్ళ తరువాత కూడా ఈ కథ అవసరం ఉండడమే, అసలు విషాదం.

ప్రకృతితో సంబంధం తెంచేసి, ప్రకృతిసహజంగా అబ్బే నైపుణ్యాలన్నిటికీ దూరంగా, పంజరంలో బిగించి, పాఠాలను కంఠతా పట్టించితే, చివరికి మిగిలేది ఏమిటి? అన్న ప్రశ్నకు జవాబు ఈ కథ.

ఊపిరాడనివ్వని అసహజ చదువుల ఉచ్చులో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అనేక చిట్టిచిలుకల కథే ఈ కథ.

References:
English Translations:

1.Sisir Kumar Das,The English Writings of Rabindranath Tagore, Voume 2, 1996, Sahitya Akademi.
2.https://www.newsgram.com/tagore-and-our-parrots-training/Arindam Basu,
3.http://arinsights.blogspot.com/2009/01/translation-of-tota-kahini-parrots-tale.html
4.https://www.youtube.com/watch?v=pS49gRqX61E
5.http://bengaliclicker.com/author/RabindraNath-Tagore

COMMENTS